## క్లుప్తంగా

### ముమ్మరంగా పారిశుధ్య పనులు



దోమల మందు పిచికారీ చేయిస్తున్న వైస్ ఎంపీపీ, సర్పంచ్

**బుచ్చెయ్యపేట:** దిబ్బిడిలో మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఎటువంటి అంటువ్యాధులు ప్రబలకుండా సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, వైస్ ఎంపీపీ గొంపా చినబాబు పంచాయతీ సిబ్బందితో కలిసి కాలువల్లో మురుగు తీయించి చెత్తా చెదారాన్ని గ్రామానికి దూరంగా తరలించారు. పలు వీధుల్లో దోమల నివారణ మందును స్ప్రేయింగ్ చేయించారు. గ్రామస్తులంతా పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు.

### శృంగవరంలో ఆరోగ్య సురక్ష శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

**నాతవరం:** గునుపూడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శృంగవరంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు సీహెచ్.అనూష, జి.లత, ఎన్.ఎస్. మల్లికార్జున్‌రావు 210 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో నేతల ప్రశాంతి పర్యవేక్షించారు. కంటి రోగులను పరీక్షించి శస్త్రచికిత్సలు అవసరమైన వారిని గుర్తించారు. మిగతా రోగులకు మందులు అందజేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

### ఆధునిక సాగుపై రైతులకు అవగాహన

**చీడికాడ:** సాంప్రదాయ వ్యవసాయం, ఆధునిక సాగుపై రైతులకు అవగాహన అవసరమని శ్రీకాకుళం నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థి నులు తెలిపారు. మంగళవారం చెట్టుపల్లిలో గ్రామీణ వ్యవసాయం, వనరులను వారు పరిశీలించారు. ఈ మేరకు వ్యవసాయ సాగు విధానంపై చక్రం వేసి రైతులకు అవగాహన కల్పించారు.

### పుస్తక పఠనంతో విజ్ఞానం



చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న లైబ్రేరియన్ శ్రీనివాసరావు

**దేవరాపల్లి:** పుస్తక పఠనం అలవర్చుకోవడం ద్వారా అపారమైన విజ్ఞానం పెంపొందించుకోవచ్చునని గ్రంథాలయ అధికారి ఓ. శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో దిన, వార, మాస పత్రికలతోపాటు పోటీ పరీక్షల పుస్తకాలను చదివించారు. అనంతరం విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి ఎక్కువ సమాధానాలు చెప్పిన వారికి ప్రోత్సాహక బహుమతులను ఆయన అందజేశారు. రోజు వార్తా పత్రికలను చదవడం అలవర్చుకోవాలని సూచించారు.

### తెగుళ్ల నివారణతో అధిక దిగుబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ రాజ్‌కుమార్

**కె.కోటపాడు:** వేరుశనగ సాగులో పంటకు ఆశించే పచ్చ తెగులు నుంచి రక్షించుకునే చర్యలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం ఏడీ రాజ్‌కుమార్ తెలిపారు. మంగళవారం వారాడలో పచ్చ తెగుళ్ల నివారణపై కె.ఎర్రంనాయుడు కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ విద్యార్థులతో కలిసి ఆయన అవగాహన కల్పించారు. ఆకుమచ్చ తెగులు లక్షణాలను వివరించడంతోపాటు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యవసాయం చేయడంలో అవగాహనతోపాటు అనుభవం ముఖ్యమన్నారు. విద్యార్థులు ఆఫ్రిది, రమణ, రవికుమార్, వివేక్ పాల్గొన్నారు.



# సిరుల పంట జాఫ్రా

- కేజీ గింజలు రూ.140కు కొనుగోలు
- గిరిజన రైతుల ఆనందం
- సరుగుడు, సుందరకోట పంచాయతీల్లో సాగు



జాఫ్రా గింజలను వేరు చేస్తున్న గిరిజన మహిళలు



గిరిజనులు సాగు చేస్తున్న జాఫ్రాతోటలు

**నాతవరం:** గిరిజన రైతులకు జాఫ్రా పంట సిరులు కురిపిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా రెట్టింపు ఆదాయం వస్తోంది. గతంలో జాఫ్రా గింజల నాణ్యతను బట్టి కేజీకి రూ.70 నుంచి రూ.90లోపు మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేశారు. ఈ ఏడాది అమాంతంగా డిమాండ్ పెరగడంతో కేజీకి రూ.140 వరకు చెల్లిస్తున్నారు.

మండలంలో సరుగుడు పంచాయతీ శివారు అచ్చంపేట, రామన్నపాలెం, రాజవరం, మాసంపల్లి, యరకంపేట, దద్దుగుల, సుందరకోట పంచాయతీ శివారు అసనగిరి తోరడ, కొత్త శిరిపురం, కొత్త దద్దుగుల, ముంతమామిడిలొద్దు, బమ్మిడికలొద్దు, కొత్త లంకలు, కె.వి.శరభవరం పంచాయతీ శివారు కొండ ధర్మవరం, కృష్ణాపురం గ్రామాల్లో గిరిజనులు జాఫ్రా సాగు చేస్తున్నారు. ఈ సాగు చేసేందుకు కొండ ప్రాంతం భూములు అనుకూలం, వర్షాధారంపై తోటలు పెరుగుతాయి. ఇతర వ్యవసాయ పంటల ఉత్పత్తులతో పోల్చుకుంటే ఇవి తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వస్తోంది. ఈ ఏడాది జాఫ్రా తోటలకు వాతావరణం అనుకూలించడంతో దిగుబడులతోపాటు ధర ఆశాజనకంగా ఉంది.

**ప్రైవేటు వ్యాపారులదే రాజ్యం...**

ఈ ప్రాంత గిరిజనులు జాఫ్రా సాగు చేయడంతో విత్తనాలు సొంతంగా తయారు చేసుకుంటున్నారు. తోటలకు పెద్దగా తెగుళ్లు ఆశించిన దాఖలాలు ఉండవు. జాఫ్రా గింజలు దుస్తులు తయారీ రంగుల్లోకి అధికంగా ఉపయోగిస్తుంటారు. పెయింటింగ్‌లకు వాడుతుంటారు. ఇతర గిరిజన ప్రాంతాల్లో కంటే ఈ ప్రాంతంలో పండించిన జాఫ్రా గింజల నాణ్యత బాగుండటంతో అధికంగా వ్యాపారులు ఆసక్తి చూపిస్తుంటారు. ఉమ్మడి జిల్లాలో పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో సరుగుడులో గిరిజన కార్పొరేషన్ (జీసీసీ) ద్వారా జాఫ్రా గింజలను అధికారులే స్వయంగా కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం ప్రైవేటు వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. దాంతో ధర బాగున్నప్పటికీ గిరిజన రైతులకు లాభాలు రావడం లేదు.



వేరు చేసేందుకు ఎండలో ఆరబెట్టిన జాఫ్రా గుత్తులు

### రూ.1.40 లక్షలకు విక్రయించా



ఈ ఏడాది మేము టన్ను జాఫ్రా గింజలను రూ.1.40 లక్షలకు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించాం. ప్రస్తుతం చివర దశలో మోస్తరు పంట ఉంది. గతంలో జాఫ్రాకు ఎప్పుడు ఇంత రేటు లేదు. రేటు పెరగదన్న ఉద్దేశంతో ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో జీడితోటలు వేశాం. ఇప్పుడు జాఫ్రా గింజల ధర చూశాక ఏమి చేయలేని పరిస్థితి.

– కె.చింతల్లి, సిరిపురం గ్రామం, సుందరకోట పంచాయతీ

### జాఫ్రా పంట ఆదాయం బాగుంది



ఇతర వ్యవసాయ పంటలతో పోల్చుకుంటే జాఫ్రా తోటలపై ఆదాయం బాగుంది. జాఫ్రా చెట్లు పొలం గట్లపై పోడు భూముల్లో వేసేందుకు అనుకూలం. తక్కువ శ్రమ, పెట్టుబడితోపాటు అధిక దిగుబడులు వస్తాయి. జాఫ్రా సాగు చేసే గిరిజనులకు వ్యాపారులు పెట్టుబడి ఇచ్చి పంట కొనుగోలు చేస్తున్నారు.

– బత్తుల కృష్ణ, సుందరకోట గ్రామం

## ఎన్నికల కోడ్ అమలుపై ప్రత్యేక దృష్టి



శిలాఫలకాల దిమ్మలపై బొమ్మలను మూసేస్తున్న అధికారులు

**నాతవరం:** ఎన్నికల కోడ్ అమలులో ఉన్నంత కాలం రాజకీయ పార్టీల జెండాలు, కటౌట్లు అనుమతులు లేకుండా ఏర్పాటు చేయొద్దని ఎంపీడీవో జాగారపు రాంబాబు, ఎస్‌ఐ రామారావు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం వారు పర్యటించి మాజీ సీఎంల విగ్రహాలకు ముసుగులు వేశారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల శిలాఫలకాలపై బొమ్మలను పేపర్లతో పూర్తిగా మూసేశారు. పలు గ్రామాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నిర్భయంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## వాహనాల తనిఖీకి సహకరించాలి



వడ్డాది జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ ఈశ్వరరావు

**బుచ్చెయ్యపేట:** సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పలు గ్రామాల్లో ప్రధాన జంక్షన్‌ల్లో చేపడుతున్న వాహనాల తనిఖీలకు ప్రజలు, వాహనదారులు సహకరించాలని ఎస్‌ఐ డి. ఈశ్వరరావు కోరారు. ఎన్నికల సందర్భంగా వడ్డాది, బుచ్చెయ్యపేట, సీతయ్యపేట గ్రామాల్లో నాల్గు రోడ్ల జంక్షన్‌తోపాటు రాజాం, బంగారుమెట్ట మూడు రోడ్ల జంక్షన్‌లో వాహనాల తనిఖీ చేపట్టి తమ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశామన్నారు. మద్యం, డబ్బులు ఇతర వస్తువులు తరలించడంపై దృష్టి సారించామన్నారు. రూ.50 వేలపైన నగదు తీసుకెళ్తే తగిన ఆధారాలు చూపించాలన్నారు. ఎవరైనా మద్యం, డబ్బులు, ఓటర్లను ఆకట్టుకునేందుకు చీరలు, ఇతర వస్తువులు పంపిణీ చేస్తే సమాచారం అందించాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

## నేడు పి.కె.గూడెంలో రామాలయ ప్రారంభోత్సవం



నూతనంగా నిర్మించిన రామాలయం

**నాతవరం:** పి.కె.గూడెంలో బుధవారం నూతన రామాలయ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇక్కడ రెండు రోజులుగా వేదపండితులతో ప్రత్యేక హోమాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తొలి రోజున ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. రెండో రోజు మంగళవారం తొమ్మిది మంది దంపతులతో హోమాలు చేశారు. సాయంత్రం సీతారాముల విగ్రహాలను పుర వీధుల్లో ఊరేగించారు. రూ.50 లక్షల విరాళాలతో సర్వాంగ సుందరంగా నిర్మించిన రామాలయాన్ని పండగ వాతావరణంలో ప్రారంభించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు. బుధవారం మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం హరిభజనలు, మహిళా కోలాటం, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## గ్రామాల్లో దోపిడీ దొంగల సంచారం

**అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలి**



సీఐ అప్పలనాయుడు

**రావికమతం:** గ్రామ శివారు ఇళ్లలో నివాసమున్న వారు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడికైనా ప్రయాణాలకు వెళ్తే సమాచారం ఇవ్వాలని కొత్తకోట సీఐ అప్పలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దొంగల ముఠా తిరుగుతుందని గ్రామాల్లో ఎవ్వరైనా ప్రయాణాలకు యాత్రలకు వెళ్లినా అటువంటి వారి ఇళ్లలో దొంగతనాలకు పాల్ప డుతుందని హెచ్చరించారు. ప్రయాణాలకు వెళ్లేవారు తమకు ముందుగా తెలియజేయాలని, వారి ఇంటి వైపు పోలీసు గస్తీ ఏర్పాటు చేస్తామన్నారు. రాత్రిళ్లు లైట్లన్నీ ఆపేసి చీకటిగా ఉంచొద్దని, అనుమానితులు ఎవ్వరైనా కనిపిస్తే 100కు డయల్ చేయాలని సూచించారు.

## 15 మద్యం సీసాలు స్వాధీనం

**పరవాడ:** మండలంలోని పెదముషిడివాడ గ్రామానికి చెందిన జెన్నారపు త్రినాథ్ మద్యం దుకాణం నుంచి 15 మద్యం సీసాలు(180 ఎంఎల్) కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తుండగా ఎస్‌ఐ టి.మల్లేశ్వరరావు దాడి చేసి అతన్ని పట్టుకున్నారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, త్రినాథ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

## ఎం. కోడూరులో నేటి నుంచి వార్షిక కల్యాణోత్సవాలు



లక్ష్మీనారాయణస్వామి వారు



వేంకటేశ్వరస్వామి ఆలయం రోలుగుంటలో..

**మాడుగుల రూరల్:** ఎం. కోడూరులో లక్ష్మీనారాయణ స్వామివారి 34వ వార్షిక కల్యాణోత్సవాలు బుధవారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దీనిలో భాగంగా ఏకాదశి పర్వ దినం సందర్భంగా బుధవారం ఉదయం నుంచి స్వామివారికి పూజలు, అభిషేకాలు, సాయంత్రం నాలుగు గంటలకు స్వామివారికి అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన, రాత్రి 8 గంటలకు స్వామివారికి, లక్ష్మీదేవికి కల్యాణం చేస్తామన్నారు. 21, 22, 23, 24 తేదీల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, 25న స్వామివారి కల్యాణోత్సవాలు ముగిస్తాయని తెలిపారు.

**రోలుగుంట:** స్థానిక కొండపైన వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం నుంచి ఈ నెల 24 వరకూ నిర్వహించే కల్యాణోత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఈ ఉత్సవాలను ముత్యాలవారి కుటుంబీకులు(వైశ్య కుటుంబీకులు) నిర్వహించనున్నారు. మంగళవారం రాత్రి 7గంటలకు పెండ్లి రాటతో కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. 24న వైభవ లక్ష్మీ కుబేర హోమం, తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ వారు తెలిపారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

**అనకాపల్లి:** జీవీఎంసీ విలీనగ్రామం కేఎస్ఆర్ పేట జాతీయ రహదారిలో అదే గ్రామానికి చెందిన లంకపల్లి ఉమామహేశ్వరరావు రోడ్డు దాటుతుండగా అనకాపల్లి నుంచి గాజువాక వెళ్తున్న ద్విచక్ర వాహనం మంగళవారం రాత్రి ఢీ కొంది. ఈ ఘటనలో ఉమామహేశ్వరరావు ఎడమకాలు విరిగిపోయింది. స్థానికులు సాయంతో 108 వాహనంలో అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు ఆస్పత్రికి చేరుకుని, వివరాలు సేకరించారు. ద్విచక్రవాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. క్షతగాత్రుని భార్య జయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ తేజేశ్వరరావు తెలిపారు.

## ప్రచారాలకు అనుమతి తప్పనిసరి

**నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన్నికృష్ణ**



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న నియోజకవర్గ ఆర్వో చిన్నికృష్ణ

**చోడవరం:** రాజకీయ పార్టీలు ఎటువంటి ప్రచారం చేసినా తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని చోడవరం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అనకాపల్లి ఆర్డీవో జీవీ చిన్నికృష్ణ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతోను మంగళవారం ఆయన సమీక్షించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అనుమతి లేకుండా ఎటువంటి ఎన్నికల ప్రచారం చేయొద్దన్నారు. రాజకీయ పార్టీలు పూర్తిగా సహకరించాలన్నారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం ఆదేశాలు, కోడ్ అమలుపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి ప్రచారాలు చేసినా, సమావేశాలు నిర్వహించినా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల నిబంధనలు ప్రతీ రాజకీయ పార్టీ పాటించాలన్నారు. సమావేశాల్లో తహసీల్దార్ వేణుగోపాలరావు, రెవెన్యూ అధికారులు, వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ, కమ్యూనిస్టు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## హిందూ ధర్మ పరిరక్షణకు కృషి

**మాడుగుల రూరల్:** హిందూ ధర్మం పరిరక్షణకు కృషి చేస్తున్నామని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బంకుపల్లి సత్యనారాయణ తెలిపారు. మండల అధ్యక్షుడు రాపేట రామకొండలరావు అధ్యక్షతన మండల విశ్వ హిందూ పరిషత్ కార్యవర్గ సమావేశం మంగళవారం సాయంత్రం కె.జె.పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ చేపడుతున్న కార్యక్రమాలు గురించి సత్యనారాయణ సమీక్షించారు. మండల కమిటీల విధులు గురించి, వివరించారు. భజరంగ్‌దళ్ ప్రతినిధి అనిల్, మండల ఉపాధ్యక్షుడు మండల సతీష్, ప్రధాన కార్యదర్శి పెచ్చెట్టి కొండలరావు, మహిళా ప్రముఖ్ నిద్దాన సంధ్య, సమరతా సేవా ఫౌండేషన్ ప్రముఖ్ తవ్వా సన్యాసిశెట్టి, సహాయ కార్యదర్శి కలవలపల్లి సోమన్నదొర, కరణం దేముళ్లు, కోరుకొండ శ్రీను, కోన గోవింద్, ఉబ్బెటి సుధీర్‌కుమార్, అప్పాన ప్రసాదు, చుక్కల అప్పారావు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల పరిశీలన



కె.కోటపాడు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఆర్‌వో ఈశ్వరమ్మ

**కె.కోటపాడు:** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.ఈశ్వరమ్మ తెలిపారు. కె.కోటపాడు, ఎ.కోడూరు పోలింగ్ కేంద్రాలను ఆమె మంగళవారం పరిశీలించారు. కేంద్రాల వద్ద వృద్ధులు, దివ్యాంగులు వచ్చేందుకు ర్యాంప్‌ల ఏర్పాటుతోపాటు విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం ఉండాలని బీఎల్వోలకు సూచించారు. ఎప్పటికప్పుడు కేంద్రాలను పరిశీలించాలని, ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆర్ఐ జానకి, వీఆర్వో అనంత్ పాల్గొన్నారు.

## సజావుగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

**నర్సీపట్నం ఆర్డీవో జయరాం**



మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

**నర్సీపట్నం:** ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి రాజకీయ పార్టీల నాయకులు నడుచుకోవాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హెచ్.వి.జయరాం పేర్కొన్నారు. మంగళవారం ఆయన అన్ని రాజకీయ పార్టీల నాయకులతో తన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను అతిక్రమించకుండా రాజకీయ పార్టీల నాయకులు ప్రచారాలు, ర్యాలీలు, ఊరేగింపులు చేసుకోవాలన్నారు. వీటి నిర్వహణకు ముందుగా అనుమతులు తీసుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే, ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు. నాలుగు మండలాల తహసీల్దార్లు, వైఎస్సార్‌సీపీ, టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గంగాదేవి(గోవ) పండగ



పందిరికి వేలాడదీసిన కొబ్బరి, అరటి గెలలు

**కె.కోటపాడు:** మర్రివలసలో యాదవ కుటుంబాల వారుతోపాటు గ్రామస్తులు గంగాదేవి(గోవ) పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పందిరికి కొబ్బరి, అరటి, ద్రాక్ష పండ్లతోపాటు, నగదు, చీరలను వేలాడదీసి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి మందిరంలోను, పందిరి వద్ద డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం పందిరికి వేలాడదీసిన సామగ్రిని భక్తులు స్వీకరించేందుకు దోపిడీ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో పాల్గొనే భక్తులకు లభించే వస్తువు అమ్మవారి ప్రసాదంగా భావిస్తారు. ఇతర ప్రాంతాల్లో ఉంటున్న గ్రామస్తులు పెద్ద ఎత్తున రావడంతోపాటు బంధువులు, స్నేహితులతో గ్రామమంతా సందడిగా మారింది. సాయంత్రం తప్పెటగుళ్ల ప్రదర్శన ఆకట్టుకుంది.

# రెండో రోజు ప్రశాంతం

**పకడ్బందీగా పది పరీక్షలు**



గొలుగొండ: సహాయకురాలితో పరీక్ష రాయిస్తున్న దివ్యాంగ విద్యార్థి దుర్గా శివ గిరీష్

**మాకవరపాలెం:** రెండో రోజు మంగళవారం పది పరీక్షలకు 525 మంది విద్యార్థులు హాజరయ్యారు. తామరం, మాకవరపాలెంలో మూడు కేంద్రాల్లో 538 మంది విద్యార్థులకుగాను 13 మంది విద్యార్థులు హాజరు కాలేదని ఎంఈవో మూర్తి తెలిపారు.

**గొలుగొండ:** మండలంలో చీడిగుమ్మల, ఏఎల్‌పురం, గురుకుల కళాశాల పాఠశాలలో రెండో రోజు పదో తరగతి హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ కేంద్రాల్లో 602 విద్యార్థులకుగాను 590 మంది హాజరయ్యారు. గొలుగొండ గురుకుల కళాశాలలో తన సహాయకురాలితో దివ్యాంగ విద్యార్థి శివదుర్గా గిరీష్ పరీక్ష రాశాడు.

**రావికమతం:** మండలంలో ఐదు పరీక్ష కేంద్రాల్లో రెండో రోజు 18 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో తలుపులు మంగళవారం తెలిపారు. అయిదు కేంద్రాల్లో 923 మంది విద్యార్థులకుగాను 905 మంది హాజరయ్యారన్నారు.

**మాడుగుల రూరల్:** పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రెండో రోజు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. హిందీ పరీక్షకు 12 మంది హాజరు కాలేదని ఎంఈవోలు పాండురంగరావు, దేముడమ్మ తెలిపారు. ఐదు కేంద్రాల్లో 756 మందికిగాను 744 మంది హాజరు కాగా, 12 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

**దేవరాపల్లి:** మండలంలో రెండు పరీక్ష కేంద్రాల్లో గట్టి పోలీస్ బందోబస్తు నడుమ పరీక్షలు నిర్వహించారు. దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో 219 మంది విద్యార్థులకు గాను ఒక్కరు గైర్హాజరయ్యారని, తెనుగుపూడిలో 210 మందికి గాను శతశాతం హాజరయ్యారని ఎంఈవో బి.పడాల్‌దాస్ తెలిపారు. తెనుగుపూడి గురుకుల విద్యార్థులు దేవరాపల్లి కేంద్రానికి చేరుకునేందుకు అధికారులు ప్రత్యేక ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేశారు.

## నాగరాజు మృతి పార్టీకి తీరని లోటు

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు



నాగరాజు మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

**మాడుగుల:** కోఆపరేటివ్ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఇందుకూరి నాగరాజు మృతి పార్టీకి తీరని లోటు అని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మంగళవారం సత్యవరంలో నాగరాజు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా అతని మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి డిప్యూటీ సీఎం నివాళులర్పించారు. పార్టీ బలోపేతానికి గ్రామ స్థాయిలో ఎనలేని కృషి చేశారన్నారు. జెడ్పీటీసీ కిముదు రమణమ్మ, ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు.